క్లస్టర్ అధికారుల నియామకం

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమగ్ర పర్యవేక్షణకు క్లస్టర్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటారం, మల్హర్, మహాముత్తారం క్లస్టర్‌కు కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, మహాదేవపూర్, పలిమెల మండలాల క్లస్టర్‌కు డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, భూపాలపల్లి, గణపురం క్లస్టర్‌కు రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, గోరికొత్తపల్లి, చిట్యాల, రేగొండ క్లస్టర్‌కు స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, మొగుళ్లపల్లి, టేకుమట్ల క్లస్టర్‌కు భూపాలపల్లి ఆర్డీవో రవిని నియమించారు.

యూరియా సరఫరాలో సమస్యలు ఏర్పడొద్దు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతులకు సమస్యలు ఏర్పడకుండా యూరియాను సరఫరా చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి సంబంధిత అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశమయ్యారు. యూరియా లభ్యతపై సమీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. పట్టాపాస్ పుస్తకాలు ఉన్న రైతులతో పాటు పాస్‌పుస్తకాలు లేని రైతులకు కూడా ఆధార్‌కార్డు ప్రామాణికంగా యూరియా పంపిణీ చేయాలన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేయాలన్నారు. చిట్యాల మండలంలో యూరియా కొరత ఉందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. రైతులకు నష్టం చేసే వ్యక్తులను ఉపేక్షించబోమన్నారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఏవో బాబురావు, డీపీవో వాల్యానాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

విద్యా వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం కృషి

చిట్యాల (ఆంధ్రజ్యోతి) : విద్యా వ్యవస్థ పటిష్టతకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో నూతన ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్‌తో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగాన్ని మెరుగుపర్చేందుకు పాఠశాలల పునఃప్రారంబానికి ముందు వేసవి సెలవుల్లోనే విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తద్వారా మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించామన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, ఎంపీడీవో జయశ్రీ, జిల్లా సెక్టోరియల్ అధికారి లక్ష్మణ్, ఎంఈవో కోడెపాక రఘుపతి, ఎంపీవో రామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, జిల్లా నాయకులు మధువంశీకృష్ణ, తిరుపతి రెడ్డి, దొడ్డి కిష్టయ్య, చింతల సుమన్, మోహన్‌రావు, ఎమ్మార్సీ సిబ్బంది హరీశ్, నరేష్, సంపత్, సీఆర్పీ రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

గణపురం (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రత్యేక వసతులు కల్పించి ప్రభుత్వం నాణ్యమైన విద్య అందిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని చెల్పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఎం శ్రీ బెస్ట్ స్కూల్‌లో భాగంగా రూ. 15లక్షల నిధులతో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. తహసీల్దార్ సత్యనారాయణ, డీఈవో రాజేందర్, ఎంపీడీవో భాస్కర్, నాయకులు వెంకన్న, మలహల్‌రావు, సంపత్‌రావు, రమేష్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలోని గోరంట్లకుంట శిఖం భూమిలో వెలిసిన వెంచర్

ఉదాసీనత ఇంకెన్నాళ్లు?!

ఆక్రమణలు తొలగించేదెన్నడు?

- భూపాలపల్లిలో చెరువుల అన్యాక్రాంతం
- కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోనే వెంచర్ ఏర్పాటు
- అప్పటి అధికార పార్టీ దన్నుతో శిఖం భూమి అమ్ముకున్న వైనం

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చెరువులు అన్యాక్రాంతం అవుతున్నాయి. శిఖం భూములు కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి. పరిరక్షించాల్సిన అధికారులే తమకేం పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. చెరువులు ఒక్కొక్కటిగా కబ్జాకు గురై వెంచర్లుగా మారుతున్నాయి. పబ్లిక్ ఆస్తులను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే చెరువులను చెరపడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. చెరువులను కబ్జా చేసి వెంచర్లుగా మరుస్తున్న అక్రమార్కులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ సామాన్యులకు ప్రభుత్వ భూములను అంటగడుతున్నారు.

అక్రమార్కులు అధికార పార్టీ పంచన చేరడంతో అధికారులు చేసేదేం లేక చూస్తూ ఉండిపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. స్వయంగా కలెక్టర్ ఆదేశించినా రెవెన్యూ శాఖ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా జీవో 188ను నిర్వీర్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లా కేంద్రంలోని చెరువులు, పంట కాల్వలు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని గోరంట్లకుంట శిఖం భూములు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయి. గోరంట్లకుంటలోని సర్వే నెంబర్ 209ను సర్వే నెంబర్ 213గా నాలాకన్వర్షన్ చేసి 22.38 ఎకరాల్లో 1.32 గుంటలను అధికార పార్టీ కౌన్సిలర్, ఆయన అనుచరులు కబ్జా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆక్రమించిన భూమిని వెంచర్‌గా చేసి ప్లాట్స్ అమ్మేసుకున్నారు. గజం రూ.12వేల నుంచి రూ. 9వేల మధ్య సామాన్యులకు అంటగట్టారు. ఈ చెరువు శిఖం ఆక్రమణల వెనుక భూపాలపల్లి మండలంలో గతంలో పనిచేసి ఇప్పుడు వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న ఓ తహసీల్దార్ పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వెంచర్‌లో విద్యుత్ శాఖ అధికారులు కరెంటు సౌకర్యం కల్పించడం విస్మయానికి గురిచేస్తోంది. మరో 15 గుంటల భూమిని అక్రమించి ఓపెన్ ప్లాట్స్‌గా అమ్ముకొని జేబులు నింపుకున్నారని తెలుస్తోంది. మరికొందరు 1.25ఎకరాల చెరువు భూమి ఆక్రమించి వ్యవసాయం చేస్తున్నారు. ప్రభుత్వం మారడంతో అధికార పార్టీ పంచన చేరిన అక్రమార్కులు తమ ఆక్రమణలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



గోరంట్లకుంట శిఖం ఆక్రమణలపై జాయింట్ సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

ఇరిగేషన్ అధికారుల ఎంట్రీ.. అడ్డం తిరిగిన వ్యవహారం

గోరంట్లకుంట శిఖం భూముల్లో వెంచర్ల ఏర్పాటుపై నీటిపారుదల శాఖ అధికారుల ఎంట్రీతో ఆక్రమణల వ్యవహారం బహిర్గతమైంది. నీటిపారుదల, రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, మునిసిపల్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఆక్రమణలు వాస్తవమే అని నిర్ధారించారు. కొనుగోలు చేసిన భూములు చెరువు శిఖంలో ఉన్నాయని ప్లాట్స్ కొనుగోలు చేసిన వారు తెలుసుకొని నిర్ఘాంతపోయారు. వెంచర్ ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషించిన కౌన్సిలర్, మరికొంత మంది అప్పటి అధికార పార్టీలో ఉండటంతో చేసేందేంలేక ఉండిపోయారు. ప్రభుత్వం మారడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే మారడం, హైదారాబాద్‌లో క్రమణల తొలగింపునకు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను తీసుకురావడంతో ప్లాట్స్ (మిగతా 8వ పేజీలో)

అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతాం



గోరంట్ల కుంట శిఖం భూములను ఆక్రమించి వెంచర్ వేసిన నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతాం. ఆక్రమణలను రెవెన్యూ అధికారులు వెంటనే తొలగించాలి. శిఖం భూమిలో ప్లాట్స్ కొన్న బాధితులకు న్యాయం చేస్తా. బాధితులు నుంచి తీసుకున్న డబ్బులను వడ్డీ సహా చెల్లించాలని వెంచర్ నిర్వాహకులను ఆదేశించాం. ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి

- అన్నయ్యను బడికి పంపేందుకు తల్లితో కలిసి వెళ్లి దుర్మరణం
- భూపాలపల్లి జిల్లాలో ఘటన



తేజస్విని (ఫైల్)

మహదేవపూర్ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి) : అన్నయ్యను బడికి పంపించేందుకు తల్లితో కలిసి వెళ్లిన చిట్టి చెల్లి విగతజీవిగా మారింది. ప్రైవేటు స్కూల్ బస్సు టైర్ కింద నలిగి ప్రాణాలు కోల్పోయింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లిలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబట్‌పల్లి గ్రామానికి చెందిన సింగినేని మల్లేష్-భాగ్య దంపతులకు నాలుగేళ్ల కొడుకు అన్విత్, మూడేళ్ల కూతురు తేజస్విని ఉన్నారు. కొడుకు అన్విత్‌ను సూరారంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు పంపిచేందుకు తల్లి భాగ్య, కూతురు తేజస్విని స్కూల్ బస్సు వద్దకు వచ్చారు. కొడుకును బస్సు ఎక్కించిన భాగ్య వెనుదిరిగింది.

స్కూల్ బస్సు ముందుకు కదలగా తల్లి చేయి వదిలించుకొని ఉన్న చిన్నారి తేజస్విని ఉన్నట్టుండి దాని కింద పడిపోయింది. వెనుక టైరు తల పైనుంచి వెళ్లడంతో మెదడు చిట్లి బయట పడి అక్కడిక్కడే మృతి చెందింది. రెప్పపాటులో ఈ ఘోరం జరగ్గా తల్లి హతాశయురాలైంది. తన కళ్లెదుటే కన్న కూతురు ప్రాణాలు వదలడంతో భాగ్య కన్నీరుమున్నీరైంది. చిన్నారి మృతదేహంపై పడి ఆమె రోదించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకొని అక్కడికి వచ్చిన తండ్రి మల్లేష్ తన చిట్టి తల్లిని విగతజీవిగా చూసి గుండెలు బాదుకున్నాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై పవన్ కుమార్ సందర్శించి విచారణ చేపట్టారు. చిన్నారి మృతికి కారణమైన బస్సు డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఆయన తెలిపారు.

తండ్రి మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు చెప్పారు. మల్లేష్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా చిన్నారి తేజస్విని మృతితో ఆ ఇంట తీవ్ర విషాదం అలుముకుంది. ఈ ఘటనపై స్కూల్ యాజమాన్యం దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. మల్లేష్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చిందని ఎస్సై తెలిపారు.

బ్యారేజీల్లో కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- 'మేడిగడ్డ'లో 4.29లక్షల క్యూసెక్కులు
- 'తుపాకులగూడెం'లో 5.08 క్యూసెక్కులు

8

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక



రాంచందర్‌రావు

మహబూబాబాద్ రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు బుధవారం రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్.రాంచందర్‌రావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన తర్వాత తొలిసారి మహబూబాబాద్‌కు వస్తున్నట్లు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లికి మధ్యాహ్నం 3గంటలకు చేరుకుంటారని చెప్పారు. అక్కడ్నుంచి మహబూబాబాద్‌కు చేరుకుని ఫ్లైఓవర్ మీదుగా కురవికి వెళ్లి శ్రీవీరభద్రస్వామిని దర్శించుకోనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి గేట్ నుంచి బైక్ ర్యాలీ గా అండర్‌బ్రిడ్జి, నెహ్రూసెంటర్, తహసీల్ సెంటర్ మీదుగా శ్రీనివాసథియేటర్ నుంచి మదర్‌థెరిస్సా సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, నర్సంపేట బైపాస్‌రోడ్డు మీదుగా వీఆర్ఎస్ గార్డెన్‌కు చేరుకుంటారని చెప్పారు. అక్కడ నిర్వహించే బీజేపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని ప్రసంగించనున్నట్లు చెప్పారు. రాంచందర్‌రావుతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటిమోహన్‌రావు,మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ హాజరవుతున్నట్లు చెప్పారు.

రెండు మలేరియా కేసులు నమోదు

ఆందోళన చెందుతున్న ప్రజానీకం



నిల్వ ఉన్న నీటిలో మందును వేయిస్తున్న వైద్య సిబ్బంది

కాటారం, జూలై 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిద్నెపల్లి, జాదరావుపేట జీపీల పరిధిలోని బొప్పారం, గూడూరు గ్రామాల్లో రెండు మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. బొప్పారంలో ఐదేళ్ల చిన్నారి, గూడూరులో గర్భిణికి పాజిటివ్ వచ్చింది. దీంతో ప్రజల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. జూలై నెలలోనే ఇలా సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండగా ఈ వానాకాలం అంతా ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు. గత ఏడాది సైతం కాటారం డివిజన్ పరిధిలోని బొప్పారం, అంబట్‌పల్లి తదితర గ్రామాల్లో మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కాటారం మండల పరిధిలో రెండు మలేరియా పాజిటివ్ కేసులు నమోదు కావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. గతంలో ఏజెన్సీ తదితర మారుమూల అటవీగ్రామాల్లో మలేరియా కేసులు నమోదయ్యేవి. ప్రస్తుతం డివిజన్ కేంద్రమైన కాటారంలో నమోదు కావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీదేవి ఆదేశాల మేరకు జిల్లా ఎపిడమిక్ టీం ఇన్‌చార్జి రమేష్ కుమార్, మలేరియా సబ్ యూనియట్ ఆఫీసర్ పరమేశ్వర్ నేతృత్వంలో సభ్యులు కాపర్తి రాజు, ఊరుగొండ గోపి, హెచ్ఏ(డబ్ల్యూ)లు సుజాత, శ్యామల ఆయా గ్రామాల్లో పర్యటించారు. మలేరియా జ్వరంతో బాధపడుతున్న చిన్నారి, గర్భిణిలతో పాటు వారి కుటుంబ సభ్యులకు, చుట్టు పక్కల వాళ్లకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఫీవర్ సర్వే చేపట్టారు. ఆయా వాడల్లో దోమల నివారణ కోసం పైరెథ్రిన్ మందు పిచికారీ చేయించారు. జ్వర పీడితులకు మందులు వాడుతూ ప్రశాంతంగా ఉండాలని ధైర్యం చెప్పారు. వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగి నీటి నిల్వలు లేకుండా చేశారు.



కార్డన్‌సర్చ్‌లో పట్టుబడిన వాటిని చూపిస్తున్న సీఐ సూర్యప్రకాష్

అక్రమవ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

● గూడూరు సీఐ సూర్యప్రకాష్

గూడూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో బెల్లం, రేషన్‌బియ్యం, గుట్కా, అంబర్, గుడుంబా, మద్యం లాంటి అక్రమవ్యాపారాలకు పాల్పడితే చర్యలు తప్పవని గూడూరు సీఐ సూర్యప్రకాష్ హెచ్చరించారు. గూడూరు మండలం లైన్‌తండాలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్‌సర్చ్ నిర్వహించారు. 200 బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి క్వింటా నల్లబెల్లం, 3 క్వింటాళ్ల పటికను, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా సీఐ సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. గ్రామాలలోని యువత చెడు అలవాట్లకు బానిసకాకుండ చదువు, క్రీడలపై దృష్టిసారిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. తమ పిల్లలు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు, గంగారం ఎస్సైలు గిరిధర్‌రెడ్డి, రవికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య

● కేసు నమోదు చేసిన పోలీసులు

బయ్యారం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మద్యం మానేయ్యమని భర్త మందలించడంతో మనస్థాపం చెందిన భార్య పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడగా మంగళవారం బయ్యారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం భీమ్లాతండా గ్రామానికి చెందిన బాణోత్ రెడ్డి బుచ్చి దంపతుల కుమారుడు సుమారు 15 ఏళ్ల క్రితం చనిపోయాడు. ఎదిగిన కొడుకు హఠాత్తుగా చనిపోవడాన్ని తట్టుకోలేని తల్లి బుచ్చి (38) మద్యానికి బానిసైంది. మానిపించేందుకు భర్త చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ క్రమంలోనే ఈ నెల 28న సోమవారం నాడు మద్యం మానెయ్యమని భర్త రెడ్డి తన భార్య బుచ్చిని గట్టిగా మందలించాడు.

దీంతో మనస్థాపం చెందిన బుచ్చి సోమవారం సాయంత్రం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయానికి పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు బుచ్చి ని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బుచ్చి ఆరోగ్య పరిస్థితి విషమంచడంతో మంగళవారం మృతి చెందింది. భర్త పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

హేమాచలుడి హుండీ ఆదాయం 9.18 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మంగపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు మంగళవారం జరిగింది. తొమ్మిది హుండీలను తెరచి మే 20 నుంచి ఈనెల 28 వరకు వచ్చిన కానుకలను లెక్కించారు. వీటి ద్వారా ఆలయానికి రూ. 9,18,310 ఆదాయం సమకూరగా కొన్ని విదేశీ కరెన్సీలు కూడా ఉన్నాయని ఈవో సత్యనారాయణరావు తెలిపారు. ఈ హుండీలను హైదరాబాద్, మణుగూరు, పాల్వంచ, సాంబయ్యగూడెం, గోవిందరావుపేట, ఏటూరునాగారం తదితర ప్రాంతాలకు చెందిన 86 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఈవో సత్యనారాయణరావుతోపాటు ప్రధాన అర్చకుడు ముక్కమళ్ల రాజశేఖరశర్మ పర్యవేక్షించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీస్తే చదువులో వారు అద్భుతాలు సృష్టిస్తారని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని అక్షయ భౌతిక శాస్త్రంలో న్యూటన్ సిద్ధాంతాలపై నిర్వహించిన దశావతారంపై నిర్వహించిన వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. విద్యార్థిని అక్షయను అభినందించారు. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు వెళ్తే విజయాలు సాధిస్తామని అన్నారు. అనంతరం కనుబొమ్మలతో మహదేవపూర్ ఎనిమిదో తరగతి విద్యార్థులు చేసిన కోడింగ్‌ను వీక్షించారు. ఈ టెక్నిక్ ద్వారా మాటలు, పాటలు, సాంకేతిక భాషల అవసరం లేకుండా కనుబొమ్మల కదలికలతోనే పాఠాన్ని గ్రహించి కచ్చితంగా చెప్పగలగడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థిని అక్షయను వండర్ బుక్ వరల్డ్ రికార్డు ప్రశంసాపత్రాన్ని, మెడల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ బింగి నరేందర్, రాష్ట్ర కో ఆర్డినేటర్ అరుణ్ కుమార్, హెచ్‌ఎం రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, తహసీల్దార్ రామారావు, ఎంఈవో



విద్యార్థిని అక్షయకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

ప్రకాశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ఇంటింటి నుంచి సేకరించిన వ్యర్థాలను దహనం చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు ఉత్తమ ఎరువుగా వినియోగించుకోవచ్చని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కాళేశ్వరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన వ్యర్థాల దహన వాటికను పరిశీలించారు. సరస్వతి ఘాట్ వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించారు. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోందని, స్నానాలు చేసే భక్తులను అందులోకి వెళ్లనీయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో స్థానిక రెవెన్యూ అధికారులను కంట్రోల్ రూమ్ 9030632608 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రామారావు, కాళేశ్వరం ఆలయ ఈవో మహేష్ తదితరులు ఉన్నారు. కాళేశ్వరం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ గ్రామానికి చెందిన కోలా శాన్వి, గంట హరిచందన, నాగుల తులసి రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనందును కలెక్టర్ అభినందించారు.

వరినాట్లు వేసిన వ్యవసాయాధికారులు



రైతులతో కలిసి వరినాట్లు వేస్తున్న వ్యవసాయాధికారులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు, వ్యవసాయ కూలీలతో మమేకమై వ్యవసాయాధికారులు వరినాట్లు వేసి ఉత్తేజపరిచిన సంఘటన మహబూబాబాద్ జిల్లా శనిగపురం శివారు చెరువుముందు తండాలో మంగళవారం జరిగింది. జిల్లాలో వర్షాలు పడుతుండడంతో వరినాట్లు ముమ్మరం కావడంతో జిల్లా వ్యవసాయాధికారి అజ్మీర శ్రీనివాసరావు వ్యవసాయాధికారులతో కలిసి జిల్లాలో వరినాట్ల పరిశీలనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 65 వేల ఎకరాల్లో వరినాట్లు పడ్డాయని తెలిపారు. వరినారుమడిలో నాటు వేసిన ఏడు నుంచి ఎనిమిది రోజుల ముందు ఒక ఎకరం నారుమడికి ఒక కేజీ కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేసుకోవాలని సూచించారు. తద్వార వరిలో కాండం తొలిచే పురుగును ఆశించకుండ అరికడుతుందని చెప్పారు. నారు పోసిన 20 నుంచి 25 రోజుల తర్వాత నాటు వేసుకోవడం వల్ల అధిక పిలకలు వస్తాయని, చదరపుమీటర్ పరిధిలో 33 కుదుర్లు ఉండే విధంగా వేసుకోవాలని చెప్పారు. అధిక దిగుబడి పెరుగుతుందన్నారు. జింక్ లోపం ఉన్నట్లయితే ఎకరాకు 10 కిలోల జింక్ సల్ఫేట్, 21 శాతం నాటు వేసే ముందు దుమ్ము చేసుకోవాలని చెప్పారు. ఆగస్టు 15 లోపు నాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి, ఏవో టెక్నికల్ రాజు, మోహన్, ఏఈవో సాయిప్రకాష్, రైతులు వాంకుడోతు భద్రు, వీరు, రాము పాల్గొన్నారు.



నాగదేవతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

నాగదేవత ఆలయ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలోని నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. నాగుల పంచమి సందర్భంగా మంగళవారం ఆయన నాగదేవత ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగదేవత ఆలయంతోపాటు చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం కోసం రూ.10లక్షలు కేటాయిస్తానని అన్నారు. మరిన్ని నిధులు కేటాయించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు దండా వెంకటేశ్వర్ రెడ్డి, చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫి, పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, నాయకులు నరహరి లక్కిరెడ్డి, తక్కళ్లపల్లి రాజు, సుమన్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు పనులను ప్రారంభిస్తాం

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ రాఘవరెడ్డి

వెంకటాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం నుంచి ఎదిర పంచాయతీ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తామని ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ రాఘవరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని వీరభద్రవరం, బోదాపురం వంతెనలను పరిశీలించామని, కుక్కతోగు వంతెన పైనుంచి భారీ వాహనాలు, ఇసుక లారీలు ఎక్కువ సంఖ్యలో వెళ్తుండడంతో వైబ్రేషన్ ఎక్కువైందని అన్నారు. వంతెనను పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెనలను తరచూ తనిఖీ చేస్తామని తెలిపారు. మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతలమయంగా మారాయని, రోడ్ల మరమ్మతు పనుల కోసం రూ.2కోట్ల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. టెండరు ప్రక్రియ పూర్తయిన వెంటనే రోడ్ల మరమ్మతు పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. రోడ్ల రీ కన్‌స్ట్రక్షన్ కోసం రూ.44కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించామని, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కాగా, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు ఎస్‌ఈని కలిసి రోడ్లు గుంతలమయంగా ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. ఈఈ సాంసింగ్, డీఈ వెంకటరమణ పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా వీక్లీ స్పెషల్ రైళ్లు రద్దు

కాజీపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సౌత్ ఈస్ట్రన్ రైల్వేలో జరుగుతున్న అభివృద్ధి పనుల దృష్ట్యా కాజీపేట మీదుగా నడిచే వీక్లీ స్పెషల్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (17007) చర్లపల్లి - దర్భంగా మీదుగా నడిచే దర్భంగా ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 26న, సెప్టెంబరు 9న రద్దుచేశారు. ఇదే రైలు డౌన్‌లో ఆగస్టు 29న, సెప్టెంబరు 12న రద్దుచేశారు. (17005) హైదరాబాద్ - రక్సోల్ మధ్య నడిచే రక్సోల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 21, సెప్టెంబరు 12న రద్దుచేశారు. డౌన్‌లో ఆగస్టు 24, 31వ తేదీలలో రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆర్టీసీ బస్సులోంచి పడి మహిళకు గాయాలు

కృష్ణకాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రం లోని మంజూర్‌నగర్‌లో మంగళవారం ప్రమాదం చోటు చేసుకుంది. పరకాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో భూపాలపల్లికి వస్తున్న మంజూర్‌నగర్‌లోని వేయి క్వార్టర్స్ కాలనీకి చెందిన కనుగూరి కవిత తీవ్రంగా గాయపడింది. ఆమె చేతిలో ఉన్న బ్యాగ్ కిందపడిపోగా ఆమె బస్సులోంచి ఒక్కసారిగా దూకిందని స్థానికులు తెలిపారు. దీంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావం కాగా ఆస్పత్రికి తరలించారు. ఆ మహిళ పూర్తి వివరాలు తెలియరాలేదు.

దరఖాస్తుల ఆహ్వానం

మొగుళ్లపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కిశాల కస్తూర్బాగాంధీ బాలికల కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్టీ సివిక్స్ (పొలిటికల్ సైన్స్), సీఆర్టీ ఇంగ్లిష్ పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఆర్టీ ఇంగ్లిష్ కోసం అభ్యర్థులు ఎంఏ ఇంగ్లిష్ లేదా బీఏ ఇంగ్లిష్ లిటరేచర్ తోపాటు బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. సివిక్స్ సబ్జెక్టులో ఎంఏ పొలిటికల్ సైన్స్, బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఆగస్టు 1వతేదీలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె వివరించారు.

ఎస్సీ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్

కాటారం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ డిమాండ్ చేశారు. కాటారం ఎస్సీ కాలనీని ఆయన మంగళవారం సందర్శించారు. వీధిలైట్లు వెలగకపోవడంతో పాములు, తేళ్లు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాజకీయ నాయకులకు ఎన్నికల సమయాల్లోనే ఎస్సీలు గుర్తుకొస్తారా? అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించిన వాళ్లకే స్థానిక ఎన్నికల్లో ప్రజలు మద్దతు ఉంటుందన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి

గూడూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు మిర్యాల సతీష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో మంగళవారం పీఆర్టీయూటీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు కోసం ఉపాధ్యాయులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుపతలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మిర్యాల సతీష్‌రెడ్డి, డాక్టరేట్ పొందిన గోపీనాథ్‌ను మండల శాఖ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రవిచంద్ర, వెంకటేశ్వర్లు, రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీధర్, బాలయ్య, లక్ష్మాపతి, మురళీధర్, పగడయ్య, కమలాకర్, కృష్ణమూర్తి, రమేష్, లక్ష్మయ్య, గోపినాథ్, ఆనంద్, నవీన్, విజయ్ పాల్గొన్నారు.



అయోధ్యపురంలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి

చిట్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని డీటీఎఫ్ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి విమర్శించారు. చిట్యాల మండలంలోని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో తిరుపతి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించడం, పీఆర్సీ అమలు, పాత పెన్షన్ పునరుద్ధరణ, పెండింగ్ బిల్లుల చెల్లింపులలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్నారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న డీఈవో, డిప్యూటీ డీఈవో పోస్టుల భర్తీ, కేజీబీవీ, సమగ్రశిక్ష ఉద్యోగులు, మోడల్ స్కూల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 1న జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నాకు ఉపాధ్యాయ, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర బాధ్యులు వీరేశం, సుదర్శన్, వెంకటరాం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో తగ్గిన గోదావరి నీటిమట్టం



కాళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం

మహదేవపూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. 8.89 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. ఎగువన ప్రాణహిత నది వరద తగ్గడంతో గోదావరి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. తెలంగాణలోనూ వర్షాలు తగ్గడంతో నదికి వరద ఉధృతి తగ్గిందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



సింగరేణి పాఠశాల విద్యార్థులతో బెంగళూరుకు చెందిన అధికారులు

మినీ ల్యాబ్‌ను సందర్శించిన బెంగళూరు అధికారులు

కృష్ణకాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింగరేణి పాఠశాలలో నేషనల్ స్టేమ్ సంస్థ సహకారంతో నడుస్తున్న మినీ ల్యాబ్‌ను బెంగళూరుకు చెందిన ప్రతినిధులు ఎన్.నాగదేవ్, శ్రీకాంత్ మంగళవారం సందర్శించారు. మినీ ల్యాబ్‌కు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకరావాలని అన్నారు. ల్యాబ్ మూలంగా జిల్లా సైన్స్ ఫేర్‌లోని మ్యాథ్స్ విభాగంలో నేషనల్ స్టేమ్‌కు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, కాపూరి మారుతి, అసోసియేషన్ నాయకులు ఎంవీరావు, జనగాం రాయమల్లు, మండల శ్రీనివాస్, దాసరపు సంజీవరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సుల విస్తరణకు సహకరించాలి

కేంద్రాన్ని కోరిన ఎంపీ కావ్య

హనుమకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎలక్ట్రికల్ బస్సుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద తెలంగాణ రాష్ట్రానికి 2,800 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరు ప్రతిపాద నను ఆమోదించాలని కావ్య విజ్ఞప్తి చేశారు. ఎలక్ట్రికల్ బస్సుల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ రక్షణతో పాటు తెలంగాణ రవాణా రంగానికి నూతన శక్తినిస్తాయని ఎంపీ పేర్కొన్నారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ స్పందిస్తూ, ప్రామాణిక జీసీసీ మోడల్‌ను మాత్రమే కేంద్రం ఆమోదిస్తోందని తెలిపారు.

రాష్ట్రం సూచించిన హైబ్రిడ్ మోడల్ ప్రస్తుత పథకంలో లేనందున ఇంకా పరిశీలనలో ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రం తరుపున మరిన్ని అంశాలు లేవనెత్తుతూ కేంద్రం రాష్ట్ర అవసరాలకు అను గుణంగా విధానాల్లో మార్పులు చేయాలని అభ్యర్థించారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం పక్షాన 2800 ఎలక్ట్రిక్ బస్సుల ప్రతిపాదన కోరారు. హైబ్రిడ్ జీసీసీ మోడల్ ద్వారా ఉపాధికి మద్దతు కల్పించాలన్నారు. సీఈఎస్ఎల్ ఆధ్వర్యంలో బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఎంపీ కావ్య కోరారు.

నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

కృష్ణకాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా కురిమిళ్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. భూపాలపల్లిలో మంగళవారం జరిగిన జిల్లాలోని సమావేశంలో జిల్లాలోని 12 మండలాల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొని జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. భూపాలపల్లి పట్టణానికి చెందిన కురిమిళ్ల శ్రీనివాస్ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన నడిగొట్ల రామును ఎన్నుకున్నారు.



ధ్వంసమైన పోతన నగర్ రోడ్డు

వామ్మో.. గుంతలు..

» అధ్వానంగా వరంగల్ నగర రోడ్లు
» వర్షానికి గుంతలైన ప్రధాన రహదారులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్లపై వాహనాలతో ప్రయాణించే ప్రజలు బయటకు వెళ్లి తిరిగి వస్తారనే గ్యారెంటీ లేదు. రోడ్లను దూరం నుంచి చూస్తే బాగానే ఉన్నా దగ్గరికి వెళ్లే సరికి ఎక్కడ చూసినా ప్రాణాంతక గుంతలు, మోకాలులోతు గుంతలు ఉంటున్నాయి. దీంతో వాహనచోదకులు, కార్లు, భారీ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా నిత్యం ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరుగుతున్న ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. స్మార్ట్‌సిటీ, జనరల్ ఫండ్‌తో పాటు ఇతర నిధుల నుంచి కోట్లు ఖర్చు చేసి నగర రోడ్లను అద్దంగా తీర్చి దిద్దాల్సిన అధికారులు.. నిద్రమత్తు నటిస్తుండడంతో కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేసినట్టు వర్షంతో వెలుగులోకి వచ్చింది. ఈ వారం వ్యవధిలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో పడి సుమారు 22 మంది చికిత్స పొందుతున్నట్టు తెలిసింది.

గుంతలమయమైన ప్రదేశాలు

వరంగల్ నగరం పాలక సంస్థ పరిధిలోని పోతననగర్‌రోడ్డు, విజ్ఞాన్ ముందు రోడ్డు, గోపాల్‌పూర్ జంక్షన్, ఖమ్మం ఓవర్ బ్రిడ్జి ప్రాంతం, ఖమ్మం ఫ్లైఓవర్ బ్రిడ్జి, వరంగల్ బస్‌స్టేషన్, అంబేద్కర్ భవన్ ముందు, కేయూ రోడ్డు, యాదవ నగర్, రమేష్‌బార్ ముందు, ములుగురోడ్డు జంక్షన్, హనుమాన్‌నగర్ జంక్షన్, భీమారం జంక్షన్, వరంగల్ 12 మోరీల జంక్షన్, శివనగర్‌రోడ్డు, కరీమాబాద్‌రోడ్డు, మడికొండ జంక్షన్, బాపూజీనగర్ వద్ద రోడ్లు వర్షానికి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గ్రేటర్ వరంగల్ అధికారులు గుంతలను గుర్తించి ప్రత్యేక బడ్జెట్‌తో ప్యాచ్ వర్క్‌లు చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



అంబేద్కర్ భవన్ వద్ద రోడ్డుపైనే ఉన్న మట్టి కుప్పలు, రాళ్లు



ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ వద్ద తెరిచి ఉన్న మ్యాన్‌హోల్



ఖమ్మం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ధ్వంసమైన రోడ్డు



శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అక్రమ దందా

» బల్దియాలో జవాన్లతో వసూళ్లు
» రీషఫిల్ చేసినా మారని తీరు
» పీహెచ్ వర్కర్లనూ వదలని వైనం
» ఒకరికి బదులు మరొకరు విధులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లతో పాటు మెయిన్ రోడ్లపై ప్రజాపాలన విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అక్రమాలు పెరిగిపోతున్నాయి. వారి చేతికి మట్టి అంటకుండా కొందరు జవాన్లను ఎంపిక చేసుకుని వారి చేత అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ట్రై సిటీస్‌లోని పెద్ద హోటళ్లు, దాబాలు, బార్లు, రెస్టారెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్ షాపింగ్ మాల్స్ నుంచి నెల వారీగా ఇచ్చే చెత్త పన్ను కాకుండా అదనంగా అడ్డదారిలో గార్బేజ్ పన్ను వసూలు చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అక్రమ చెత్త పన్నుతో పాటు 66 డివిజన్లలో పని చేసే పబ్లిక్ హెల్త్ (పీహెచ్) వర్కర్లతో పాటు ప్రభుత్వ శానిటరీ ఉద్యోగుల నుంచి నెల వారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇవ్వబోమని తెగేసి చెప్పేవారికి కష్టమైన పనులు పురమాయిస్తున్నారు. వారితో డ్రెయినేజీలు శుభ్రం చేయించడం, జంతు కళేబరాలు తరలించడం, మెయిన్ రోడ్లు ఊడ్పిస్తారని కార్మికులు చెబుతున్నారు. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శాశ్వతంగా కొందరు పీహెచ్ వర్కర్లను జవాన్లుగా ఎంపిక చేసి వారికి పదోన్నతులు కల్పిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతుంది.

ఎక్కువ డివిజన్లు.. తక్కువ ఇన్‌స్పెక్టర్లు

గ్రేటర్ శానిటేషన్ విభాగంలో 1 సీఎంహెచ్‌వో, 1 ఎంహెచ్‌వో, 2 శానిటరీ సూపర్‌వైజర్లు, 7 ఒరిజినల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 5 మలేరియా విభాగం నుంచి ఎంపిక చేసిన డిప్యుటేషన్ ఇన్‌స్పెక్టర్లు, 1 ఫారిన్ సర్వీస్ (మెడికల్ డిపార్ట్‌మెంట్)కు సంబంధించిన అధికారులు పని చేస్తున్నారు. ఉద్యోగ నియామకాల కుంభకోణంలో ఇరుక్కున్న ఓ ఇన్‌స్పెక్టర్ సైతం ఖమ్మం నుంచి ఇటీవల తిరిగి జీడబ్ల్యూఎంసీ శానిటేషన్ విధుల్లో చేరి చర్చనీయాంశంగా నిలిచాడు. చాలాకాలంగా పాతుకుపోయిన 13 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఇటీవల 66 డివిజన్లకు రీషఫిల్ చేశారు.

ఐనా వారి ప్రవర్తనలో మార్పు రాకుండా వారి వద్ద గతంలో పర్మినెంట్‌గా పని చేసి అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిని సైతం వారి వెంటే తీసుకుని వెళ్లినట్లు ప్రచారం జరుగుతుంది. ఐతే కొందరు ఉన్నతాధికారులతో చనువుగా ఉన్న ఇన్‌స్పెక్టర్లకు వారు కోరుకున్న డివిజన్లు, 6 కమర్షియల్ మెయిన్ రోడ్లను అప్పగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో 250 మందికి పైగా వైట్‌కాలర్ జవాన్లు డ్యూటీకి హాజరు కాకుండా పర్సనల్ పనులు చేసుకునే ప్రభుత్వ (పీహెచ్) వర్కర్ల వద్ద నెలకు రూ. 10 వేలు, ఔట్ సోర్సింగ్ కార్మికుల నుంచి నెలకు రూ. 500 నుంచి వెయ్యి వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అలాగే బదిలీ వర్కర్‌ను పెట్టినట్లు ఆయా డివిజన్లలో పని చేస్తున్న కొందరు జవాన్లు అధికారులు, కమిషనర్‌ను సైతం తప్పుదోవ పట్టిస్తూ నెలకు లక్షల్లో వెనకేసుకోవడంతో పాటు డివిజన్ ఇన్‌స్పెక్టర్‌కు నెలకు రూ. 1 లక్ష ఇస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒక్కో డివిజన్‌లో సుమారు 25 నుంచి 35 మంది శానిటేషన్ కార్మికులు పని చేయాల్సి ఉండగా ప్రస్తుతం 10 మంది కంటే ఎక్కువ చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పని చేసే సిబ్బంది మీదనే అదనపు భారం పడడం వల్ల రోగాల బారిన పడుతున్నారు.

కమిషనర్ గారు.. జర దేఖోజీ

గతంలో ఉన్న అధికారులు శానిటేషన్ విభాగంపై దృష్టి సారించపోవడంతో సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఆడిందే ఆట పాడిందే పాటగా డ్యూటీ చేశారు. కానీ కొత్త కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ వచ్చిన తర్వాత కూడా వారి విధుల పట్ల దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వారి పని విధానంలో మార్పు రాకపోతే వరంగల్ నగరం చెత్త కుప్పలా మారిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జవాన్ల డ్యూటీ చేస్తున్న సూపర్‌వైజర్లు

వరంగల్ శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నగరంలో జవాన్ల డ్యూటీలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరమైన వరంగల్ బల్దియాకు కనీసం 6 శానిటరీ సూపర్‌వైజర్లు పని చేయాల్సి ఉంది. కాని ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రస్తుతం ఇద్దరే పని చేస్తున్నారు. ఆ ఇద్దరు తలో నాలుగు డివిజన్లు, మెయిన్ రోడ్లను పంచుకుని వర్కర్ల నుంచి జవాన్ల ద్వారా అందిన కాడికి దండుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రతిరోజూ శానిటరీ సూపర్‌వైజర్లు డివిజన్లలో పర్యటిస్తూ అక్కడి సమస్యలు గుర్తించి ఆయా డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లకు పనులు అప్పగించాల్సి ఉంటుంది. కానీ సూపర్‌వైజర్లు అడ్డదారిలో వచ్చే డబ్బులకు ఆశపడి వారి స్థాయిని తగ్గించుకుని జవాన్ డ్యూటీలు చేస్తున్నారని కింది స్థాయి సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఎలుకల మందు తాగి విద్యార్థి ఆత్మహత్య

పాఠశాల వద్ద బంధువులు ఆందోళన

తొర్రూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు తాగి 10వ తరగతి చదువుతున్న విద్యార్థి బానోత్ వెంకట చైతన్య (15) మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామ శివారు మర్రికుంట తండాకు చెందిన వెంకన్న-అనిత దంపతుల కుమారుడు వెంకట చైతన్య తొర్రూరు మండలం వెల్లికట్టె గ్రామ శివారులోని అభ్యాస్ పాఠశాలలోని హాస్టల్‌లో ఉంటూ పదవ తరగతి చదువుతున్నాడు. మూడు రోజులుగా ఒంటరిగా ఉంటూ, నిత్యం ఆన్‌లైన్ ద్వారా వచ్చిన పుస్తకాలు చదువుతూ, స్నేహితులకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 27న రాత్రి హాస్టల్‌లో ఎలుకల మందు తాగడం గమనించిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యంతో కలిసి వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించింది. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్లు తెలిపారు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు మృతికి గల కారణాలు తెలియజేయాలని పాఠశాల ఎదుట మృతదేహం వేసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ గణేష్, ఎస్సై ఉపేందర్ ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి ఆందోళన విరమింప చేశారు. తన కుమారుడి మృతికి గల కారణాలు తెలియజేయాలంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



వెంకట చైతన్య (ఫైల్)

ఆయుర్వేద వైద్య కళాశాలలో 10 సీట్లు కోత

ఫ్యాకల్టీ కొరతతో తగ్గించిన వైద్య కమిషన్

గిర్మాజీపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వరంగల్ అనంతలక్ష్మీ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా సీట్లను కోల్పోయింది. మొత్తం 63 బీఏఎంఎస్ సీట్లకు ఈ ఏడాది (2025-26)ప్రవేశాలకు 10 సీట్లను తగ్గిస్తూ నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్ (ఎన్సీఐఎస్ఎం) ఆదేశాలు జారీ చేసింది. నిబంధనల ప్రకారం కళాశాలలో ఫ్యాకల్టీతో పాటు మౌలిక సదుపాయాలు లేనందున సీట్లు తగ్గిస్తున్నట్లు వైద్య కమిషన్ పేర్కొంది. గతేడాది కూడా ఇవే కారణాలతో 4 సీట్లను తగ్గించిన విషయం తెలిసిందే. కాగా, 'ఆయుర్వేద వైద్య కళాశాలల్లో సీట్లకు గండి' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. అందులో చెప్పినట్లుగానే 10 సీట్లు తగ్గాయి. అయితే 10 సీట్లకు కోత పడటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి కేంద్ర ప్రభుత్వస్థాయిలో వైద్య కమిషన్‌తో చర్చించి తగిన హామీ ఇస్తే కోల్పోయిన 10 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ విషయంలో మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ తీసుకొని వైద్య కళాశాల సీట్లను కాపాడాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



అమ్మ వారికి చీరె సారె సమర్పిస్తున్న భక్తులు ←

భద్రకాళి అమ్మవారికి చీరెసారె సమర్పణ

51 రకాల స్వీట్లు, పండ్లతో పూజ

వరంగల్ కల్చరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు భద్రకాళి అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీలక్ష్మీ శ్రీనివాస సేవా ట్రస్టు మహబూబాబాద్ అధ్యక్షుడు బి. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 300 మంది భక్తులు వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి మేళతాళాలతో చీరె సారెతో ఆలయానికి తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకొని 51 రకాల స్వీట్లు, వివిధ రకాల పండ్లతో పాటు చీరె సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి.శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, స్రవంతి, సుగుణ, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషుతో పాటు భట్టి శ్రీనివాస్, భార్గవి, కార్పొరేటర్లు చాడా స్వాతి రెడ్డి, దేవరకొండ విజయలక్ష్మి, సురేందర్, హేమలత, నాగజ్యోతి, రజినీరెడ్డి, వనజ తదితరులు పాల్గొన్నారు.

పరకాలను జిల్లాగా ఏర్పాటు చేయాలి

» మహిళలను కోటీశ్వరులను చేస్తాం : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
» ప్రజలు సహకారంతోనే పట్టణాభివృద్ధి : హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

పరకాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పరకాలను అమరవీరుల జిల్లాగా ఏర్పాటు చేయాలని, గత పాలకుల నిర్లక్ష్యంతో పరకాలకు అన్యాయం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఎక్స్‌కవేటర్, ఆరు స్వచ్ఛ ఆటోలను కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫెడ్ ఫెస్టివల్ స్టాళ్లను అధికారులతో కలిసి సందర్శించారు. మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, స్టాళ్లను పరిశీలించారు. అలాగే వన మహోత్సవంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మునిసిపల్ కార్మిక సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. మైనింగ్ ఏరియా భూపాలపల్లి వంటి ప్రాంతాలను జిల్లాగా ఏర్పాటు చేశారని కొంత కాలం తర్వాత ఆ ప్రాంతాల్లో జనసంచారం ఉండదన్నారు. పరకాలకు అన్ని రకాలుగా అర్హత ఉందన్నారు. పరకాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. పీయూఎఫ్ ఐడీసీ నిధులతో డీపీఆర్ ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ వచ్చే నెల 2న ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే రూ. 40 కోట్లతో డ్రెయినేజీ, రూ. 11 కోట్లతో రోడ్ల అభివృద్ధి చేస్తున్నామన్నారు. పరకాలకు పూర్వవైభవం తీసుకరావడానికి ప్రజల సహకరించాలని కోరారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరైన వారు త్వరగా ముగ్గులు పోసి నిర్మాణం చేపట్టాలన్నారు. 469 ఇళ్లకు 45 శాతం పురోగతి ఉందన్నారు. 45 రోజులు దాటితే నోటీసులు ఇచ్చి మంజూరు పత్రాలను రద్దు చేస్తామన్నారు. అధికారులు వెంటపడి ఇంటి నిర్మాణం ప్రారంభించాలన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశాడని ఆరోపించారు.

అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రజలు సహకారంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమన్నారు. మహిళలు తడి, పొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి అందించాలని కాలనీ వారీగా కంపోస్టు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మెప్మా సిబ్బందికి శిక్షణ అవసరమని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని మొదలు పెట్టి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇల్లు కట్టుకునే వారికి మెప్మా ద్వారా ఆర్థికసాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవో నారాయణ, కమిషనర్ సుష్మ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి, ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, కట్కూరి దేవేందర్‌రెడ్డి, సోదా రామకృష్ణ, మడికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికురాలికి దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్

దిగొచ్చిన సన్న బియ్యం ధరలు

» మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో..
» సన్న బియ్యం పంపిణీతోనే దిగిన ధరలు
» ప్రభుత్వం 3 నెలల బియ్యం ఇవ్వడంతో తగ్గిన గిరాకీ
» ధరలు తగ్గడంతో తలలు పట్టుకుంటున్న వ్యాపారులు

వర్ధన్నపేట రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సన్న బియ్యం ధరలు దిగొచ్చాయి. మధ్య తరగతి కుటుంబాలు సన్న బియ్యం కొనాలంటేనే వామ్మో అనేవారు. ప్రస్తుతం ఈ బియ్యం ఆ కుటుంబాలకు అందుబాటులో ఉండేవిధంగా ధరలు ఉన్నాయని బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు, మిల్లర్లు, దుకాణాదారులు చెబుతున్నారు. రేషన్ దుకాణాల ద్వారా ఓ పక్క ప్రభుత్వం సన్న బియ్యం ప్రారంభించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం మూడు నెలల పాటు రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో సన్న బియ్యాన్ని కొనుగోలు చేసే కుటుంబాలు తక్కువై పోయాయి. దీంతో దుకాణాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రెండు నెలల్లోనే రూ. 700-1000 వరకు ధరలు పడిపోవడంతో ప్రజలు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి సన్న బియ్యం ..

సన్న బియ్యం రెగ్యులర్‌గా కొనే వారిలో మధ్య తరగతి కుటుంబాలే ముందు వరుసలో ఉంటాయి. కొంత మంది దుకాణాదారుల వద్ద కిలోల చొప్పున కొనుగోలు చేస్తారు. మరికొంత మంది నేరుగా మిల్లర్ల వద్దే కొనుగోలు చేసుకుంటారు. ప్రస్తుతం సన్న బియ్యం కొనుగోలు చేయాలనుకునే మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు చెపుతున్నారు. రూ. 5 వేలకు పైగా ధరలు పలికిన సన్న బియ్యం ఇప్పుడు రూ. 4 వేలకు పైగా మాత్రమే పలుకుతున్నాయి. జై శ్రీరాం బియ్యం సైతం రూ. 6 వేల వరకు పలికిన సందర్భంలో ఇప్పుడు రూ. 5వేలకు పడిపోయాయి. ఆర్ఎన్ఆర్, బీపీటీ బియ్యం సైతం రూ. 4 వేలు, కొన్ని చోట్ల ఆ లోపు ధరలతో అమ్మాల్సిన పరిస్థితి వచ్చింది.



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దివిటిపెల్లిలోని రైస్‌మిల్‌లో ఉన్న బియ్యం బస్తాలు

రైస్ మిల్లర్లకు తీవ్ర నష్టం

రైస్ మిల్లు వ్యాపారులకు సన్న బియ్యం ధరలు తగ్గడంతో తీవ్ర నష్టం చవిచూస్తున్నారు. సన్నాలు పండించిన రైతులకు సైతం బోనస్‌తో కలిపి దాదాపు రూ. 3 వేల వరకు మద్దతు ధర వస్తుండడంతో బియ్యం ధరలు పెరిగి కొన్ని రోజుల పాటు లాభాలు గడించారు. కానీ ఇప్పుడు సన్న బియ్యాన్ని అడిగే వారు కూడా లేకపోవడంతో మిల్లుల్లో బియ్యం నిల్వలు పెరిగిపోయాయి. కొంత మంది మిల్లర్లు ఇంకా సన్న వడ్లను మరాడించకుండానే పక్కన పెట్టేశారు. సాధారణ మిల్లులు కూడా దాదాపు క్రాప్‌కు వెయ్యి క్వింటాళ్లకు పైగా సన్న వడ్లను కొనుగోలు చేసి అమ్మేవారు. పెద్ద మిల్లర్లు దాదాపు 3000-5000 క్వింటాళ్ల వరకు మరాడించి దుకాణాదారులు, హోటళ్లకు పంపించేవారు. కానీ గత రెండు నెలలుగా మిల్లులు సైతం పని చేయడం మానేశాయి. ప్రభుత్వానికి పంపిద్దామని చూసిన ఇప్పటికే గోదాములు నిండిపోయాయని పంపిస్తే తీసుకోబోమని చెబుతున్నారని సమాచారం.

భారీగా నష్టపోయాం..



పంట కోతలు కాగానే సన్న బియ్యం కోసం మాకు ఆర్డర్లు వచ్చేవి. ఈసారి రేషన్ బియ్యం మూడు నెలల పాటు ఇచ్చే సరికి సన్న బియ్యం కొనేవారు తక్కువయ్యారు. సగానికి పైగా వ్యాపారం పడిపోయింది. మిల్లుల్లోనే సన్న బియ్యం నిల్వలు ఉండిపోయాయి. ఒక్కసారిగా ధరలు తగ్గడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వానికి వెళ్లాల్సిన బియ్యం సైతం గోదాముల్లో ఉండిపోయింది.

పెద్దబోయిన శంకర్, మిల్లు యజమాని, వర్ధన్నపేట

బియ్యం ధరల వివరాలు క్వింటాల్(రూ.లలో)

రకం	మే	జూన్/జూలైలో ధర	తగ్గిన ధర
సాంబమసూరి	6000	4700	1300
జైశ్రీరాం	6500	4900	1600
స్టీమ్ రైస్	5000	3900	1100
బీపీటీ	5000	4300	700
ఆర్ఎన్ఆర్	5500	4500	1000

రేపు ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

హసన్‌పర్తి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుబ్బయ్యపల్లిలో ఈ నెల 31న సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేపు (గురువారం) ఉదయం 9 గంటలకు కళాశాల ప్రాంగణంలో 10వ తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు.

స్కూటీపై 120 చలాన్లు

రూ. 32,165 పెండింగ్

కాజీపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీలో భాగంగా ఓ మాస్ట్రో స్కూటీపై ఏకంగా 120 చలాన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటలోని ఎఫ్‌సీఐ పాయింట్ వద్ద మంగళవారం తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఏపీ 36 ఏఎక్స్ 4930 మాస్ట్రో ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా 120 చలాన్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ చలాన్ల విలువ రూ. 32,165 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. సదరు వాహనదారునికి డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పెండింగ్ చలాన్లను చూపుతున్న ట్రాఫిక్ సీఐ వెంకన్న

తుపాకులగూడెం బ్యారేజీలో 5.08 క్యూసెక్కులు

దేవాదుల ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న పంపింగ్


తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీలో నీటి ప్రవాహం

కన్నాయిగూడెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ, గుట్టల గంగారం వద్ద ఉన్న దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద మంగళవారం గోదావరి తగ్గుముఖం పట్టింది. సమ్మక్క బ్యారేజీలో ఎగువ నుంచి 5,08,190 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో బ్యారేజీలోని మొత్తం గేట్లు 59 ఎత్తి, ఫ్రీఫ్లోగా ఉంచి 5,07,023 టీఎంసీల నీటిని దిగువకు వదులుతున్నారు.

అలాగే జె.చొక్కారావు దేవాదుల ఎత్తి పోతల ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగుతోంది. మంగళవారం మధ్యాహ్నం వరకు ఫేజ్- 2 నుంచి రెండు మోటార్ల ద్వారా 494 క్యూసెక్కుల నీటిని అధికారులు పంపింగ్ చేశారు. ఫేజ్-2లోని రెండు మోటార్లను ఆపి, ఫేజ్-3లో నాలుగు మోటార్లను ఆన్ చేశారు. వీటి ద్వారా 1167 క్యూసెక్కుల నీటిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా భీంఘనపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు. సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద 79.40 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 79.80 మీటర్ల నీటిమట్టం ఉందని ఇరిగేషన్ డీఈఈ శరత్ బాబు, ఏఈ సాయిరాం తెలిపారు.

'మేడిగడ్డ'కు కొనసాగుతున్న ప్రవాహం

- 4.29 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం బ్యారేజీకి వచ్చే ఇన్‌ఫ్లో 4.29లక్షల క్యూసెక్కులుగా నమోదుకాగా గేట్లన్నీ ఓపెన్ చేసి, వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. మళ్లీ మధ్యాహ్నం నుంచి ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుముఖం పట్టింది. బ్యారేజీ వద్ద గోదావరి నది 5.50 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

కేజీబీవీలో నియామకాలు

చిట్యాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ బోధ నకు దరఖాస్తులు స్వీకరిం చనున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ సుమలత తెలిపారు. ఈమేరకు మంగళవారం ప్రకట నలో పేర్కొన్నారు. నర్సింగ్ విద్యార్థులకు బోధించేందుకు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలి పారు. ఈనెల 30, 31 తేదీల్లో కేజీబీవీ కళాశాలలో హాజరుకావాలని, మెరిట్ ఆధా రంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రమేష్

మల్హర్, జూలై 29(ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన దండు రమేష్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. 2016 నుంచి కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రమేష్ కొనసాగుతున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన

కృష్ణకాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కు ఉపకరణాలను అందించేందుకు వారి సర్టిఫికెట్లను అదనపు కలెక్టర్ విజయలక్ష్మి నేతృత్వంలో అధికారులు మంగళవారం పరిశీలించారు. కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే అర్హుల జాబితాను ప్రకటించి అవసరమైన వారికి ఉపకరణాలను అందిస్తామని తెలిపారు. రిట్రో ఫిట్టెడ్, మోటరైజ్డ్ వెహికిల్, లాప్‌టాప్, హైగ్రేడ్ వీల్‌చైర్, మొ బైల్ బిజినెస్, బ్యాటరీ ట్రైసైకిల్, టాబ్స్, 5జీ స్మార్ట్‌ఫోన్స్, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో, ఇతరత్రా ఉపకరణాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. రవాణా శాఖ జిల్లా అధికారి సమ్మానీ, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో మల్లీశ్వరి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శ్రీదేవి పాల్గొన్నారు.

'రాజ్యమేలుతున్న ఇసుక మాఫియా'

కాటారం, జూలై 29(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నాయకుల అండదండలతో మండలంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. మండలంలోని విలాసాగర్ మానేరునది సమీపంలో ఉన్న ఇసుక డంపుల వద్ద ఆయన మంగళవారం మాట్లాడారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మానేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. డంపుల నుంచి లారీల్లో జీరో ఇసుకను లోడ్ చేసి వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు అమ్ముకుంటున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు ఉప్పు సంతోష్ ఉన్నారు.

కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

మహదేవపూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరంలో శ్రావణమాస మంగళవారం గరుడ పంచమి, కాలసర్ప దోష నివారణ పూజలను ఘనంగా నిర్వహించారు. మొదటగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయానికి చేరుకున్నారు. భక్తులు తొమ్మిది రకాల ధాన్యాలు, వస్త్రాలతో పాల్గొన్నారు. నవగ్రహ పూజలు, దోష నివారణ పూజలు చేసి ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు.

భక్తాంజనేయ స్వామికి విశేష అలంకరణ


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కాటారం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటారం భక్తాంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి మంగళవారం సందర్భంగా ఆంజనేయ స్వా మిని అర్చకుడు నిఖిల్‌శాస్త్రి 516 అరటి పండ్లతో అందంగా అలంక రించారు. గ్రామానికి చెందిన మిలటరీ జవాన్ సుంకరి గుణపటేల్ అరటి పం డ్లను అందించగా అర్చకుడు ప్రత్యేక పూజలు, అభిషేకం చేసిన అనంతరం విశేష అలంకరణ చేపట్టారు. గారెపల్లి, ధ న్వాడ, గంగారం, రేగులగూడెం తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో వేదపండితులు కృష్ణమోహన్, సుమిత్‌పాండే, లక్ష్మీకాంత్, ప్రవీణ్, గణేష్ ప్రత్యేక పూజలు చేశారు.

కస్తూర్బాలో పోస్టుల భర్తీ

మహదేవపూర్, జూలై 29(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులు బోధించడానికి పోస్టులను భర్తీ చేస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ చేసి టెట్ క్వాలిఫై అయిన వారు అర్హులని పేర్కొ న్నారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో మహదేవపూర్ కస్తూర్బా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సింగరేణి సీఎండీ జన్మదిన వేడుకలు


కృషకాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో ఉన్న అమృత వర్షిణి అక్షర స్వచ్ఛంద సంస్థ వృద్ధాశ్రమంలో సింగరేణి సీఎండీ బలరాం నాయక్ జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్గా ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు.

'ఆరోపణలు అవాస్తవం'

మొగుళ్లపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్లపల్లి, పోతుగల్లు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులపై ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎమ్డీ.రఫీ, మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి అన్నారు. ఈమేరకు మంగళవారం మండలకేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు దండ వెంకటేశ్వర్‌రెడ్డి, బక్కిరెడ్డి, రాములు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భూపాలపల్లికి సిరికొండ

- మూడు రోజుల పాటు ఇక్కడే మకాం!
- పార్టీ శ్రేణులు, అనుచరులతో సమావేశం



కృష్ణకాలనీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జిల్లాకు బుధవారం రానున్నారు. సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకొని భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారంలో పర్యటించనున్నారు. అలాగే, రాత్రి భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసుకున్న కార్యాలయంలోనే బస చేస్తారు. మర్నాడు భూపాలపల్లి పట్టణం, ఆ తర్వాత చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల్లో పర్యటనలు చేయనున్నట్లు ఆయన అనుచరులు ద్వారా తెలిసింది. మొత్తంగా భూపాలపల్లి నియోజకవర్గంలోనే మూడు రోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటునున్నట్లు అంటున్నారు.

ఏమంటారోననే ఉత్కంఠ

ఇటీవల జిల్లాలో పర్యటించిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్థానిక అంశాలపై మాట్లాడారు. నియోజకవర్గంలో ఎవరి నేతృత్వం కీలకమో చెప్పకనే చెప్పారు. దీనిపై ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఎలా స్పందిస్తారోననే ఉత్కంఠ ఆయన అభిమానులు, కార్యకర్తలు, అనుచరుల్లో నెలకొంది. తన మనసులో మాటను బయట పెట్టేందుకు మూడు రోజుల కార్యక్రమాన్ని ఆయన ఫిక్స్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ముఖ్య నాయకులు, అనచురులతో సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే.. రాష్ట్రంలో బీసీ నినాదాన్ని బీఆర్‌ఎస్ లేవనెత్తుతుండగా భూపాలపల్లికి నియోజకవర్గానికి వచ్చే సరికి బీసీ నేతనే నియోజకవర్గానికి దూరంగా పెట్టడమేమిటనే చర్చ జోరుగా సాగుతోంది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో మధుసూదనాచారి ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నారనే విషయం నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది.

ప్రభుత్వ ప్లీడరుకు సన్మానం

రేగొండ, జూలై 29(ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా కోర్టుకు ప్రభుత్వ ప్లీడరుగా నియమితులైన మండల కేంద్రానికి చెందిన బొట్ల సుధాకర్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టి న్యాయవాదిగా సేవలందిస్తూ ప్రభుత్వ ప్లీడరుగా ఎదగడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మోడెం ఉమేష్‌గౌడ్, కాంగ్రెస్ రేగొండ టౌన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మైస భిక్షపతి, మేకల భిక్షపతి, ఐలి శ్రీధర్, రఘు, గండి తిరుపతి, కటకం సంపత్, తాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం

కాటారం, జూలై 29(ఆంధ్రజ్యోతి):మండలంలో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎఫ్‌ఆర్వో స్వాతి నేతృత్వంలో రేంజ్ అటవీ అధికారులు కాటారం జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో టైగర్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పులుల ప్రాముఖ్యత, వాటి సంరక్షణ, మొక్కల పెంపకంపై విద్యార్థులకు అటవీఅధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జామ, అల్లనేరేడు వంటి పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సమ్మయ్య, కాటారం, యామన్‌పల్లి డిప్యూటీ రేంజర్లు సురేందర్, శ్రీనివాస్, ఎఫ్‌ఎస్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవోలు మొయినొద్దీన్, రాజేందర్, అశోక్, సంజీవ్, రాజ్‌కుమార్, బేస్ క్యాంప్ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

మంగపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిమ్మగూడెం, నర్సాయిగూడెం, కొత్తూరుమొట్లగూడెం గ్రామాల్లోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖ సహకారంతో వెలుగు రేఖ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సంస్థ సీఈవో రజిత మాట్లాడుతూ వ్యవసాయం చేయడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తూ అధిక లాభాలు పొందొచ్చన్నారు. అదేవిధంగా క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువుల వాడకం పూర్తిగా తగ్గిస్తూ అధిక భూసారాన్ని పరిరక్షిస్తూ భావితరాలకు ఆరోగ్యవంతమైన జీవనాన్ని అందించడమే తమ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు మహేష్, భావన, గాయత్రీతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉదాసీనత ఇంకెన్నాళ్లు?!

(5వ పేజీ తరువాయి)

కొన్నవారిలో కలవరం మొదలైంది. ఈ నేపథ్యంలో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి తేవడం ప్రారంభించారు. వెంచర్ వేసిన అక్రమార్కులకు అధికార పార్టీలో కూడా అండదొరకడంతో బాధితులకు ఇబ్బందులు తప్పలేదు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఒత్తిడికి తలొగ్గిన అక్రమార్కులు బాధితులకు వేరే చోట ప్లాట్స్ ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం.

హైకోర్టు మెట్లెక్కిన ఇరిగేషన్ శాఖ

మంజూర్‌నగర్‌లోని గోరంట్లకుంట శిఖం భూమిలో జరిగిన అక్రమాలపై నీటిపారుదల శాఖ, సర్వేల్యాండ్, మునిసిపాలిటీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. శిఖం భూమిలో వెంచర్, వ్యవసాయ భూమి, వెంకటేశ్వర ఆలయం నిర్మాణం, కాంప్లెక్స్ కట్టడంతో పాటు ఎమ్మెల్యే కాంప్లెక్స్, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఆలయం, కాంప్లెక్స్ నిర్మాణాలు కోర్టు పరిధిలో ఉండటం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రభుత్వ నిర్మాణాలు కావడంతో అధికారులు వీటిపై ఎటువంటి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదు. శిఖంలో వెలిసిన ఇతర కట్టడాలపై చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వలంటూ నీటిపారుదల శాఖ అధికారులు 2024 జనవరి 29న అప్పటి కలెక్టర్ భవేష్ మిశ్రాకు లేఖ రాశారు. ఆయన ఆక్రమణలపై ఏమి తేల్చకపోవడంతో చేసేదేంలేక ఇరిగేషన్ అధికారులు 2024 ఏప్రిల్ 26న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

కలెక్టర్ ఆదేశించినా..

గోరంట్లకుంట శిఖం ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించినా రెవెన్యూ అధికారులు అడుగు ముందుకు వేయడం లేదు. రెవెన్యూ, ఇరిగేషన్, సర్వేల్యాండ్స్ రికార్డ్స్, మునిసిపాలిటీ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి ఆక్రమణలు జరిగాయని అప్పటి కలెక్టర్ భవేష్‌మిశ్రాకు నివేదిక అందించారు. భవేష్ మిశ్రా బదిలీ కావడంతో ఆయన స్థానంలో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్‌శర్మ గోరంట్లకుంట శిఖం ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని 2024 సెప్టెంబరు 9న భూపాలపల్లి ఆర్డీవోను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశించి దాదాపు సంవత్సరం కావస్తున్నా ఆక్రమణలపై ఆర్డీవో ఇప్పటి వరకు తీసుకున్న దాఖలాలు లేవు. జీవో 188 ప్రకారం ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటల్లోని నిర్మాణాలను తొలగించాల్సి బాధ్యత రెవెన్యూ శాఖపైనే ఉంటుంది. ఇప్పటి వరకు గోరంట్లకుంట ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శిఖం భూమిని కబ్జా చేసి వెంచర్ వేసిన వారిలో చాలా మంది ఇప్పుడు అధికార పార్టీ పంచన చేరడంతో రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

నానో యూరియాతో బహు ప్రయోజనాలు

జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి బాపురావు


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఏవో

కాటారం, జూలై 29(ఆంధ్రజ్యోతి): నానో యూరియా, నానో డీఏపీ వాడకంతో బహుప్రయోజనాలు ఉంటాయని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి (డీఏవో) బాపురావు అన్నారు. మండలంలోని రేగులగూడెం రైతువేదికలో మంగళవారం పలువురు రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నానో యూరియా, డీఏపీల వాడకం, కల్గే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన డీఏవో మాట్లాడుతూ నానో డీఏపీ తో పంటలకు పోషకాల లభ్యత, శోషణను పెంచడంద్వారా దిగుబడి అధికమవుతుందన్నారు. అవసరమైన పోషకాలను సమర్థంగా అందించడం ద్వారా మొక్కల పెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. నానో యూరియా మొక్కల ఆకుల ద్వారా సంగ్రహించి పంటలు బాగా ఉంటాయని వెల్లడించారు. పర్యావరణంపై ప్రభావం తగ్గుతుందని, నేలల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. నానో యూరియాతో రవాణా ఖర్చులు తక్కువై వాడకం సులభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీపాల్, ఏవో పూర్ణిమ, ఏఈవోలు రాజన్న, అస్మా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో డీఏవో తనిఖీలు

:మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఇన్‌చార్జి డీఏవో బాపురావు, మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్‌తో కలిసి తనిఖీలు చేశారు. డీసీఎంఎస్ కేంద్రాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేసి స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు(ఎఫ్‌సీవో) చట్టం-1985 అనుసరించి నియమనిబంధనలు పాటించాలని డీలర్లను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యూరియాతో సహా ఇతర ఎరువులను ఎమ్మార్పీకి మించి అమ్మరాదని, లింక్‌లు పెట్టరాదని ఆదేశించారు డీఏవో వెంట మండల వ్యవసాయాధికారి ఎస్ఎంఎస్ పూర్ణిమ, ఏఈవో అస్మా తదితరులు ఉన్నారు.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం అందాలి

విజిలెన్స్, మానిటరింగ్ సమావేశంలో కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అదనపు కలెక్టర్ సంపత్‌రావుతో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలపై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కేసు పూర్వపరాలను పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో బోర్ల మంజూరు అసలైన లబ్ధిదారులకు అందించామని మానిటరింగ్ కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాకేంద్రంలో అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని, ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత ఇవ్వాలని సభ్యులు కోరారు. యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, డ్రగ్స్ నిర్మూలన కోసం అన్నిశాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. డీఎస్పీ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామని, ఎఫ్ఐఆర్, చార్జిషీట్, పరిష్కారం అయిన కేసులు, విచారణలో ఉన్న కేసులకు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఈసమావేశంలో ఆర్డీవో వెంకటేశ్, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు జన్ను రవి, రాంబాబు, నరేందర్, చింత కృష్ణ, రామునాయక్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుడిసెలు వేసుకునేందుకు అనుమతి ఇవ్వండి

ఏటూరునాగారం రూరల్, జూలై29, (ఆంధ్రజ్యోతి): జంపన్నవాగు ఉధృతికి భయపడే గ్రామాన్ని విడిచి వేరే ప్రాంతంలో నివాసం ఉండడానికి బయల్దేరి వెళ్లామని కొండాయి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 28వ కొండాయికి చెందిన 20 కుటుంబాలు ఊరును విడిచి దొడ్ల గ్రామ శివారులో వెళ్లి గుడిసెలు వేసుకున్నారు. మంగళవారం అటవీశాఖాధికారులు గుడిసెలు వేసుకోవద్దని, ఇక్కడి నుంచి వెళ్లాలని వారికి సూచించారు. దీంతో కొండాయి వాసులు తమను ఎక్కడకు వెళ్లామంటారని, వాగు పక్కన ఉండి కొట్టుకుపోవాలా? అని అటవీశాఖ ధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న కాంగ్రెస్ నాయకులు మంత్రి దనసరి సీతక్కతో ఫోన్‌లో సమాచారం అందించారు. ఈ సందర్భంగా సీతక్క గ్రామస్థులతో ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా గ్రామస్థులకు న్యాయం చేస్తామని, అధైర్య పడొద్దని హామీనిచ్చారు.

ఫాస్ట్‌ట్రాక్‌ను ఎత్తివేయాలని నిరసన

ఏటూరునాగారం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారంలో ఉన్న ఫాస్ట్ ట్రాక్‌తో పాటు పస్రా వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌లను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎమ్డీ. దావూద్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫాస్ట్ టాక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దావూద్ హాజరై మాట్లాడుతూ. ప్రజలపై టోల్‌భారం మోపడం దుర్మార్గమని, గతంలో ఈ ఫాస్ట్ ట్రాక్ టోల్‌గేట్‌ను ఇసుక లారీలకు మాత్రమేనని అటవీ శాఖ అధికారులు చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రతి ఫోర్‌వీలర్‌లకు సుమారు రూ. 100 వసూలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎమ్డీ. యాకూబ్, నాయిని కృష్ణ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు బాబు, స్వామి, రాకేష్, ధనుష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఐని కలిసిన వాడబలిజ నేతలు

వెంకటాపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన ముత్యం రమేష్‌ను మంగళవారం వాడబలిజ సేవాసంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్, అధికార ప్రతినిధి తోట మల్లికార్జునరావులు ఆయనను శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు గగ్గూరి రమణయ్య, అల్లి సూరిబాబు, ముత్యాలరావు,రమేష్, ఆదినారాయణ, పానెం రమేష్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు సన్మానం

ములుగు టౌన్ జూలై 29(ఆంధ్రజ్యోతి): ములుగు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారిని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కీటక జనిత నియంత్రణ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ చంద్రకాంత్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవం

ములుగు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బండారుపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం వార్షికోత్సవం జరిగింది. కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆలోత్ దేవ్‌సింగ్, విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ అర్షం రాజు, ఎంఈవో తిరుపతి, ప్రిన్సిపాల్ సింగారం దేవకి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ఏటూరునాగారం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూఎస్పీసీ జిల్లా నాయకులు సమ్మయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 1న ములుగులోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూఎస్పీసీ జిల్లా నాయకులు పత్రి కిరణ్, సి.హెచ్.సుమన్, ఎం.శ్రవణ్‌కుమార్, బి.రాజు, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన ప్రత్యేకాధికారి

రేగొండ, జూలై 29(ఆంధ్రజ్యోతి) : రేగొండ మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బాలుర వసతి గృహాన్ని మండల ప్రత్యేకాధికారి ఎడ్ల సునీల్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వంట గదిని, కూరగాయలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ టాయిలెట్లు, వంట గది పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.